నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | డిసెంబర్ 28, 2023 | www.navatelangana.com

పెండింగ్ చలాన్లు చెల్లించండి

- వాహనదారులకు పోలీసుల సూచన



నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల వాహన దారులకు చలాన్లపై రాయితీ కల్పిస్తోందని, వాహనదారులందరూ పెండింగ్ చలాన్లు త్వరగా చెల్లించాలని పోలీసులు సూచించారు. బుధవారం వర్ని పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పించారు. చలనాను ఫోన్‌పే, పేటీఎం ద్వారా కూడా కట్టుకోవచ్చని తెలిపారు.

కొనసాగుతున్న ఉచిత భోజన కార్యక్రమం



నవతెలంగాణ-బోధన్

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రోగులకు ఉచిత భోజనం (బువ్వ కుండా) కార్యక్రమం కొనసాగుతుంది. నిత్య అన్నదాన కార్యక్రమం సుమారు ఐదు సంవత్సరాల నుంచి కొనసాగుతోందని తెలంగాణ జాగృతి బోధన్ ప్రతినిధి కొట్బూరు నవీన్‌కుమార్ తెలిపారు. హాస్పిటల్‌కు వచ్చే రోగులకు, రోగి సహాయకులకు, రోగి బంధువులకు ప్రతిరోజు సుమారు 200 నుంచి 300ల మందికి బోధన్ జిల్లా ఆసుపత్రిలో ఉచిత భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఉచిత అన్నదానంతో రోగులను ఆదుకుంటున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల కవితకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాగృతి ప్రతినిధులు మేడి రవి, హరి శంకర్, ఫజల్, రాము పాల్గొన్నారు.

సమయానికి ఉండరు.. సమస్యలు తీర్చరు..

- చందూర్ తహసీల్దార్ కార్యాలయ అధికారుల తీరు
- ఆరునెలల నుంచి సెలవులో తహసీల్దార్



చందూర్ తహసీల్దార్ కార్యాలయం

నవతెలంగాణ-వర్ని(చందూర్)

చందూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులు సమయానికి ఉండటం లేదు. రెవెన్యూ పరమైన సమస్యలు ఎదురైతే ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే.. సమస్య పరిష్కారం కావడం లేదు. అలాగే తహసీల్దార్ సైతం గత ఆరునెలల నుంచి సెలవులో ఉన్నారు. ఈ విషయమై మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా.. పరిస్థితి మారడం లేదు.

కుల, ఆదాయం, పట్టాపాస్‌బుక్‌లో తప్పులను సరిచేసుకోవడానికి ప్రజలు బుధవారం వచ్చినా.. నిరాశే మిగిలింది. మీ సేవలో దరఖాస్తు చేసుకున్నా వాటిని తీసుకోవడానికి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సంతకాలు చేయకపోవటం, ప్రజలే నేరుగా కార్యాలయానికి వచ్చినా అధికారులు ఉండటం లేదని ఆవేదన చెందుతున్నారు. కార్యాలయంలో ఉన్న ఇతర అధికారులను అడిగితే పెండ్లి పేరంటాలకు వెళ్లినట్టు ఇక్కడి అధికారులు సమాధానం చెబుతుండటం గమనార్హం. కార్యాలయంలో కుప్పలు కుప్పలుగా కుల, ఆదాయ, ఇతర ధ్రువపత్రాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. అవి పూర్తిగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రధానంగా విద్యార్థులు ఉన్నత చదువుల కోసం, ఇతర స్కాలర్‌షిప్‌ల కోసం వాటిని పొందాల్సి ఉంది. కానీ స్థానికంగా అధికారులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రంలో అక్రమంగా మొరం, ఇసుక తరలిస్తున్న వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకొనే వారు కూడా కార్యాలయంలో లేరు. ఏది అడగలన్నా, సమస్యల పత్రాలు ఇవ్వాలన్నా ఒక్క ఆర్ఐ మాత్రమే అందుబాటులో ఉంటున్నారని ప్రజలు తెలుపుతున్నారు. ఇక కార్యాలయంలో కిందిస్థాయి సిబ్బంది వారు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా మారింది. ఇప్పటికైనా తహసీల్దార్ కార్యాలయంలో తగిన సిబ్బంది ఉండేలా, ప్రజల సమస్యలు తీర్చేలా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని, చందూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పెరిగిన నేరాలు

- మహిళలపై దాడులు అదే స్థితిలో..
- పెరిగిన సైబర్, వైట్ కాలర్ నేరాలు
- వార్షిక నివేదిక వివరాలు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ లా అండ్ ఆర్డర్ జయరాం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సర కాలం పాటు నేరాల సంఖ్య బాగానే పెరిగింది. హత్యలు, లైంగికదాడులు, వేధింపులు, ఇంట్లో చొరబడి దొంగతనాలు.. ఇలా అన్ని కేసులలో నేరాల సంఖ్య గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం పెరిగింది. కాగా బుధవారం నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ శాఖ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంవత్సర కాలం పాటు జరిగిన నేరాల వివరాలను నిజామాబాద్ డిసిపి లా అండ్ ఆర్డర్ జయరాం వెల్లడించారు. జీవిత ఖైదీ శిక్షలు కూడా ఈ సంవత్సరం 14 మందికి విధించారని అలాగే 10 సంవత్సరాలు, 8, నాలుగు సంవత్సరాలు ఒక సంవత్సరం ఇలా సుమారు 100 వరకు శిక్షలు విధించారన్నారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం సూసైడ్ కేసులు కూడా ఒక పర్సెంట్ మాత్రమే పెరిగాయని అన్నారు. మోడల్ ఎలక్షన్ కోడ్లో భాగంగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా పోలీసులు సక్రమంగా విధులు నిర్వహించారని తెలిపారు. గత 2018 ఎన్నికలలో 50 కేసులు నమోదు చేయగా ఈ సంవత్సరం 2023 ఎన్నికలలో భాగంగా 117 కేసులను నమోదు చేసినట్టు వివరించారు. ఎన్నికలు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేశామన్నారు. ఎక్కడైతే ఇబ్బంది కలిగిన చోట అక్కడ కేసులను నమోదు చేశామని వివరించారు. ఈ సంవత్సరం కొన్ని కేసులను చేధించగా మరికొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా రెండు మూడు నెలల్లో కేసులను చేధిస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 31వ తేదీన ఆంక్షలు విధిస్తామని, ఈ సందర్భంగా ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎస్.జయ్‌రాం, నిజామాబాద్ ఏసిపి కిరణ్ కుమార్, సిసిఆర్బి ఏసిపి రవీందర్‌రెడ్డి, సిటిసిఎసిపి శ్రావణ్ కుమార్, ట్రాఫిక్ ఏసిపి నారాయణ, టాస్క్‌ఫోర్స్ ఏసిపి రాజశేఖర్ రాజు, సిసిఎస్ ఏసిపి విజయ సారధి, సిసిఆర్‌బి సిఐ సురేందర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- ఎస్పీ సింధు శర్మ



నవతెలంగాణ-కామారెడ్డి

పొగమంచు కారణంగా ఉదయం సమయంలో రోడ్డుపై వచ్చే వాహనాల రాకపోకలు సరిగా కనపడకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఎస్పీ సింధు తెలిపారు. ప్రమాదాలు జరగకుండా వాహనాలు నడిపే వ్యక్తులు కొన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. హెడ్‌లైట్లను తక్కువ దూరంలో ఉండేట్టుగా పెట్టుకోవాలని, ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనబడనందున వాహన వేగాన్ని తగ్గించాలని పేర్కొన్నారు. వాహనాల రాకపోకలు కనబడనందున ఎదురుగా వచ్చే వాహనాల శబ్దాన్ని విని, మీ వాహనాన్ని నడపాలని కోరారు. వాహనానికి ఉన్న ఇండికేటర్లను వాడుతూ, మలుపు తిరిగేటప్పుడు వెనక నుంచి వచ్చే వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా కనీసం పది సెకన్ల పాటు సూచన ఇవ్వడం మంచిదని తెలిపారు. పొగమంచు ఉన్నప్పుడు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి గుర్తుంచుకోవాలసిన అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, అప్రమత్తంగా ఉండటం మీ కళ్ళను రహదారిపై ఉంచడం ఏదైనా తప్పు జరగడానికి ఒక స్ప్లిట్ సెకను పడుతుంది, కాబట్టి అన్ని రకాలుగా అలర్ట్‌గా ఉండటం, ట్రాఫిక్, వాతావరణ పరిస్థితులపై దృష్టి పెట్టడం ప్రతి డ్రైవర్ బాధ్యత తీసుకోవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు.

విద్యార్థుల కోసం బస్సులు నడపాలి

- ఎబివిపి

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎబివిపి కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిరాకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కన్వీనర్ కృష్ణ మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన మహాలక్ష్మి పథకం వలన ప్రజలు ఎక్కువ మొత్తంలో బస్సులల్లో తిరగడం ద్వారా విద్యార్థులకు సరిపడా బస్సులు దొరక్క ఆలస్యంగా పరీక్షలకు వెళుతున్నారని, కామారెడ్డి డిపో పరిధిలో ఉన్న కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు సరిపడా బస్సులు నడపాలని, తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ పరీక్షలు జరుగుతుండగా వాటికి అనుకూలంగా ఉదయం ఎనిమిది గంటలకు విద్యార్థుల వద్దకు బస్సులు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్ ఇందిరాను కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి చరణ్, జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, నవీన్, అల్తాఫ్ పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీ వాలీబాల్ జట్టులో దన్‌సింగ్ తండా వాసులు

నవతెలంగాణ-గాంధారి

కాకతీయ యూనివర్సిటీ వాలీబాల్ జట్టుకు బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన గాంధారి మండల పెట్‌సంగెం గ్రామ పరిధిలోని దన్‌సింగ్ తండాకు చెందిన జరప్ల సోనియా, అజ్మీర సోన ఎంపిక అయినట్టు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, గుగులోత్ సురేందర్, ఫౌండేషన్ చైర్మెన్ సేవంత రాథోడ్ తెలిపారు. నవంబర్ 29, 30వ తేదీల్లో కాకతీయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో జరిగిన ఎంపిక పోటీల్లో వీరు ఎంపికయినట్టు వాలీబాల్ కోచ్ లక్ష్మణ్ రాథోడ్, తెలిపారు. ఈ నెల 27నుంచి 30వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయంలో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఇదిలా ఉండగా సోనియా వరంగల్‌లోని వాగ్దేవి వ్యాయామ విద్య కళాశాలలో బిపిఇడి ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, అజ్మీరా సోన ప్రభుత్వ వ్యాయామ కళాశాల ఖమ్మంలో వ్యాయామ విద్యా ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వీరు ఎంపికవడం పట్ల మండల ప్రజాప్రతినిధులు అభినందించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ



నవతెలంగాణ-కామారెడ్డి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన, కామారెడ్డి జిల్లాలోని క్రీడాకారులకు టీ షర్టులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పోలబోయిన సత్యం మాట్లాడుతూ.. క్రీడాకారులు ఆటల్లో తమ ప్రతిభను కనబరిచి పుట్టిన ఊరికి, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకు రావలసిందిగా కోరారు. రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ క్రీడాకారులను ప్రోత్సహిస్తూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రాజనరసింహారెడ్డి, శ్రీశైలం, సుధాకర్, ధనంజయ, నాగభూషణం, నంగునూరు కాశీనాథం, పనస అంజయ్య, గడ్డం గంగారెడ్డి, కృష్ణమూర్తి, రమణ, వైకే, చారి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా దరఖాస్తులను స్వీకరించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి



నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని 526 గ్రామ పంచాయతీల్లో, 80 మున్సిపల్ వార్డుల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టంగా ప్రజాపాలన సభలు నిర్వహించి ప్రజల నుంచి మహాలక్ష్మీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులు పకడ్బందీగా స్వీకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మనుచౌదరి నియోజకవర్గస్థాయి అధికారులకు, మండల ప్రత్యేకాధికారులకు సూచించారు. ప్రజాపాలన గ్రామ, వార్డు సభల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు చేరువగా పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. అర్హులైన, నిజమైన లబ్దిదారులకు దశలవారీగా, నిర్ణీత కాలవ్యవధిలో సామాజిక భద్రతా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందన్నారు. అందులో భాగంగా డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు (8) పని దినాలలో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలలోని ప్రతి వార్డులలో సభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆయన తెలిపారు. దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా మాట్లాడుతూ దరఖాస్తులు స్వీకరించాలని, ప్రజా పాలన నిర్వహణపై ప్రభుత్వ సూచనలు, సలహాలు తప్పకుండా పాటించాలని అన్నారు. ప్రతి మండలం పరిధిలో తహసిల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తున్నామని, ఆ బృందాలు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం గ్రామాలు, వార్డులకు వెళ్లాలని, ప్రజాపాలన నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు మొదలగు పథకాలకు సంబంధించి దరఖాస్తులు సభలు నిర్వహించు ప్రాంతాలలో ఒకరోజు ముందుగానే అందించాలని, గ్రామసభ నిర్వహణపై డప్పు చాటింపు ద్వారా ప్రచారం చేయాలని తద్వారా దరఖాస్తుదారులు ముందుగానే దరఖాస్తు నింపుకొని గ్రామసభకు వస్తారని అన్నారు. గ్రామంలోని నిరక్షరాస్యులకు దరఖాస్తు నింపడంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు సహకరించేలా చూడాలని మనుచౌదరి తెలిపారు. సభ నిర్వహణకు షామియానా, తాగునీరు, కుర్చీలు, అవసరమైన బల్లలు ఏర్పాటు చేయాలని, ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, దరఖాస్తుల వెంట ఆధార్, రేషన్‌కార్డు జతచేసేలా చూడాలని అన్నారు. ఆ దరఖాస్తులను ఎప్పటికప్పుడు కంప్యూటర్లో నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి రసీదు అందించాలని, ప్రజాపాలన సభ నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, వారిని భాగస్వామ్యం చేయాలని సూచించారు. గ్రామసభల కౌంటర్ల వద్ద క్యూలైన్ విధానం పాటించేలా చూడాలని, అవసరమైన మేర పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

- ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో 28వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ప్రజా పాలన పేరుతో చేపడుతున్న గ్రామసభలు ప్రజల సమస్యల పరిష్కారానికేనని, కావున గ్రామసభలో ప్రజలు అధికారులకు దరఖాస్తులు అందించినప్పుడు వాటిని ఓపికతో పరిశీలించి సమాధానం చెప్పాలని ప్రజలతో దురుసుగా వ్యవహరించవద్దని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాల కాలంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఆ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామ పాలన తీసుకొచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను నెరవేర్చడం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తారని తెలిపారు. 100 కుటుంబాలకు ఒక టీం చొప్పున కౌంటర్లు ఏర్పాటు చేసి అధికారులు దరఖాస్తులను స్వీకరించాలని కోరారు. ఉదయం, సాయంత్రం వేళ ఎంపిక చేసిన గ్రామాలలో గ్రామసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రేషన్ కార్డులు దుర్వినియోగం కావొద్దని, రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని అధికారులకు సూచించారు. విద్యా ప్రమాణాలు పెంచడానికి నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడానికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళిక చేసిందన్నారు. కావున విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థిని గుర్తించి చదువులో రాణించేలా తయారు చేయాలన్నారు. అలాగే నియోజకవర్గంలో మొరం, ఇసుక అక్రమ రవాణా జరగవద్దని వాటిని అరికట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. ఇసుక రవాణాకు ఒకటి, రెండు రోజులు తప్ప ఎక్కువ రోజులు అనుమతి ఇవ్వవద్దని సూచించారు. అధికారులు ప్రజల సమస్యలు తీరుస్తారనే నమ్మకం ప్రజలకు ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రాజాగౌడ్, తహసీల్దార్ గంగాధర్, సాలురా తహసీల్దార్ మల్లయ్య, జెడిఎ వాజిద్, మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, గంగాశంకర్, శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీకి బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ క్రీడాకారిణిలు ఎంపిక



నవతెలంగాణ-గాంధారి

కామారెడ్డి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న గాంధారి మండలం పోతంగల్‌కలాన్‌కు చెందిన ప్రణీత, త్రివేణి, సింధూజ, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు తెలంగాణ విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు గుగ్లోత్ సురేందర్, అధ్యక్షురాలు సెవంత రాథోడ్ తెలిపారు. నవంబర్ 28న తెలంగాణ విశ్వవిద్యాలయంలో జరిగిన ఎంపిక పోటీలో అద్భుతంగా ఆడి సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్టు వారు తెలిపారు. ఈ నెల 27నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయంలో జరుగుతున్న సౌత్‌జోన్ పోటీల్లో వారు పాల్గొంటున్నారని కోచ్ లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణిలకు ఫౌండేషన్ బాధ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వికలాంగులకు సంక్షేమ పథకాలలో ప్రాధాన్యతనివ్వాలి


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గ్రామసభల సంక్షేమ పథకాల ఎంపికలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో కోటగిరి తహసీల్దార్ ప్రభాకర్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేద వికలాంగులను ఆదుకోవాలని కోరారు. ఇంటి స్థలం ఇల్లు లేని అర్హులైన వికలాంగులను గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మండల కన్వీనర్ కుర్లం సాయిలు, కో-కన్వీనర్ బారిశెట్టి సాయిలు, నాయకులు కొండాబాయి, ఫారుఖ్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

దట్టమైన పొగ మంచు



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో చలి తీవ్రత పెరగడంతో పాటు, ఉదయం దట్టమైన పొగ మంచు కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉదయం 8 గంటల ప్రాంతంలో సైతం దట్టమైన పొగ మంచు కురుస్తోంది. సూర్యుడు ఉదయించినా.. పొగమంచు తొలగడం లేదు. తద్వారా తీవ్రమైన చలి వీస్తోంది. వృద్ధులు, చిన్నపిల్లలతోపాటు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని, చలిలో ప్రయాణాలకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఈ కామర్స్, డిజిటల్ వర్తకం ఉపయోగించడంతో వినియోగదారులకు రక్షణ

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున బాబు



నవతెలంగాణ-కామారెడ్డి

ఈ కామర్స్, డిజిటల్ వర్తకం ఉపయోగించడం వల్ల వినియోగదారులకు సంపూర్ణ రక్షణ కలుగుతోందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున బాబు అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈ కామర్స్, డిజిటల్ వర్తకంలో వినియోగదారుల రక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్ బాబు మాట్లాడుతూ.. ఈ కామర్స్ అనగా ఎలక్ట్రానిక్ కామర్స్, ఎలక్ట్రానిక్ నెట్వర్క్, ఇంటర్నెట్ ద్వారా వస్తువులు, సేవల కొనుగోలు, అమ్మకం, డేటాను ప్రసారం చేయవచ్చని సూచించారు. ఈ కామర్స్ ప్లాట్ ఫారమ్స్ వస్తువులు తయారు చేస్తున్న కంపెనీకి, వాటిని కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు మధ్య వారధిగా మాత్రమే ఉంటాయన్నారు. బయట దుకాణాల కంటే ఆన్లైన్లో రేట్లు చాలా తక్కువగా ఉంటాయని తెలిపారు. మంచి గుర్తింపు కలిగిన ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్ నుంచే కొనుగోలు చేయాలన్నారు. గుర్తింపు లేని రిటైలర్ల నుంచి ఎప్పుడు కొనవద్దన్నారు. ఉచిత బహుమతులు, డిస్కౌంట్లను నమ్మి మోసపోవద్దని వినియోగదారులకు సందర్భంగా సూచించారు. ఖరీదైన వస్తువులను ఆన్లైన్ ద్వారా కొనేటప్పుడు సాధ్యమైనంతవరకు క్యాష్ ఆన్ డెలివరీ ఎంచుకోవాలని చెప్పారు. మోసపూరిత ప్రకటనల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి వినియోగదారుడు డిజిటల్ లావాదేవీలు, సమాచారం మార్పిడి చేసేటప్పుడు కొన్ని స్వీయ జాగ్రతలు పాటించాలన్నారు. ఆటోమేటిక్ సాఫ్ట్‌వేర్ అప్డేట్లను ఎంచుకోవాలన్నారు. ఒకసారి ఉపయోగించిన పాస్‌వర్డ్‌లను తిరిగి ఉపయోగించకూడదని సూచించారు. ఈ వ్యక్తిగత సమాచారాన్ని బయటకు పంపవద్దన్నారు. అపరిచిత వ్యక్తుల మెయిల్స్, ఫోన్‌కాల్స్, ఎస్‌ఎంఎస్‌లకు స్పందించవద్దని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, పిన్, సివివి నెంబర్‌ను ఎవరికి చెప్పవద్దని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర వినియోగదారుల సహాయక కేంద్రం ద్వారా వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. వినియోగదారులు 180042500333/1967కి ఫోన్‌చేసి సలహాలు, సూచనలు పొందవచ్చని సూచించారు. ప్రతి వినియోగదారుడు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త వినియోగదారుల రక్షణ చట్టం-2019 పై అవగాహన పెంచుకొని మోసపూరిత వ్యాపార విధానాల నుంచి రక్షణ కల్పించుకోవాలని కోరారు. జిల్లా కార్మిక శాఖ అధికారి సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. దుకాణాల నిర్వహణ కోసం లైసెన్సులు పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ అభిషేక్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా వినియోగదారుల సంఘాల సమైఖ్య అధ్యక్షురాలు బొమ్మెర సువర్ణ చంద్రశేఖర్, జిల్లా డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మి పతి, రేషన్ షాప్‌ల, గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో సెయింట్ జేవియర్ హైస్కూల్ విద్యార్థులు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సెయింట్ జేవియర్ హై స్కూల్ విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ నరసింహారావు, లత ఆధ్వర్యంలో నగరానికి చుట్టూ ఉన్న గ్రామీణ ప్రాంతాలను బుధవారం సందర్శించారు. పంటల సాగు పద్ధతుల గురించి విద్యార్థులకు వివరించారు. వ్యవసాయంలో పంట కోసం, రైతులు ఏ విధంగా కృషి చేస్తున్నారో చెప్పారు. విత్తనాలను విత్తడం, నాట్లు వేయడం వంటి కార్యక్రమాన్ని విద్యార్థులకు వివరించేందుకు వ్యవసాయ క్షేత్రాలకు తీసుకువెళ్లామని తెలిపారు. ఆహార ఉత్పత్తిలో క్షేత్రాల కీలక పాత్రపై తెలిపారు.

రూ.20వేల ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-బాల్కొండ

మండలపరిధిలోని ఇత్వార్‌పేట్ గ్రామంలో నాలుగు నెలలు క్రితం ఆదివాసీ నాయకపోడ్ కులానికి చెందిన మెట్టు దేవిదాస్ కుమారుడు ప్రమాదవశాత్తు నీటి గుంటలోపడి చనిపోయారు. వారి కుటుంబాన్ని బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబానికి జిల్లా సేవా సంఘం తరపున 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ బాధ్యులు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు లోలం గంగాధర్, జిల్లా ప్రధానకార్యదర్శి దేగాం, గంగసాయన్న జిల్లా బాధ్యులు కంచు సతీష్, మండల బాధ్యులు నాగేష్, సభ్యులు, జిల్లా ఉద్యోగుల సేవా సంఘం జిల్లా బాధ్యులు పుట్ట. రాజేశ్వర్,పెద్ది సత్యనారాయణ(ప్రిన్సిపాల్) పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కాలేజీగా అప్ గ్రేడ్ చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజనీరింగ్ కాలేజీగా ఈ విద్యా సంవత్సరమే అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యూ కళాశాల ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్ మాట్లాడుతూ... నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇంజనీరింగ్ కాలేజీగా అప్ గ్రేడ్ కావడానికి అన్ని అర్హతలు, సదుపాయాలు ఉన్నాయన్నారు. నిజామాబాద్ జిల్లాకు ఇంజనీరింగ్ కాలేజీని కేటాయించాలని ఎన్నో ఏళ్లుగా జిల్లా విద్యార్థులు ఆకాంక్షిస్తున్నా రన్నారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్య ప్రైవేట్ కాలేజీల కబంధహస్తాల్లో చిక్కుకున్నదన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ లేకపోవడంతో, ఎంతోమంది ప్రతిభ కలిగిన నిరుపేద, పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే జిల్లాకు ఒక ఇంజనీరింగ్ కాలేజీని మంజూరు చేయడం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఈ విషయమై జిల్లాలోని ప్రజా ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు కళాశాల నాయకులు రోహన్, మహేష్, తిలక్‌లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి

- దేవాంగ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి, ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దేవాంగ సంఘం సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని చౌడేశ్వరి మందిరం నుండి శివాలయం గుట్ట శ్మశానానికి వెళ్లే దారిలో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని మండల కేంద్రానికి చెందిన దేవాంగ సంఘం సభ్యులు బుధవారం తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. అంబేద్కర్ విగ్రహం నుంచి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈవిషయమై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌ను వివరణ కోరగా దేవాంగ సంఘం సభ్యులు వినతి పత్రం ఇచ్చారని, స్మశాన వాటిక వెళ్లే దారిలో ఎవరు కూడా అక్రమంగా నిర్మాణం చేపట్టడం లేదని, ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్న వ్యక్తికి సొంత పట్టా ల్యాండ్ ఉందని తెలిపారు. దేవాంగ సంఘం వారిని పట్టా భూమి ఉన్న వ్యక్తితో మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపామని అన్నారు.

ఆర్డీఓకు అంక్సాపూర్ రైతుల వినతి



ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతులు

నవతెలంగాణ-ఆర్మూర్(వేల్పూర్)

వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామం చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మించడం వలన 150 ఎకరాల వ్యవసాయ భూములను రైతులు కోల్పోతున్నందున మొదట్లో నిర్ణయించిన విధంగా గ్రామం మధ్యలో నుంచి రోడ్డును విస్తరించాలనీ ఆర్డిఓ వినోద్ కుమార్ కు బాధిత రైతులు బుధవారం వినతి పత్రాన్ని అందించారు. 63వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అంక్సాపూర్ గ్రామం మధ్యలో నుంచి రోడ్డు వేస్తామని మొదటి నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం మొదట పేర్కొన్న అలాట్‌మెంట్‌ను మార్చి అంక్సాపూర్ చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మించాలని నిర్ణయించడం వల్ల భూములు కోల్పోయి వ్యవసాయంపై ఆధారపడిన అనేకమంది రైతులకు జీవనాధారం లేకుండా పోతుందని పేర్కొన్నారు. వాస్తవానికి ప్రస్తుతం ఉన్న రోడ్డును విస్తరించడం వలన కేవలం 500 మీటర్లు రోడ్డు వేయవలసి ఉంటుందని, ఇది కాదనుకుంటే బైపాస్ రోడ్డు ఏడు కిలోమీటర్లు వేయాల్సి ఉంటుందని తెలిపారు. బైపాస్ రోడ్డు ఏడు కిలోమీటర్లు నిర్మించడం వల్ల సుమారు 150 ఎకరాల పైన వ్యవసాయ భూములను రైతులు కోల్పోవలసి వస్తుందని, రైతుల భూములు కోల్పోవడంతో పాటు ప్రభుత్వానికి అదనంగా ఏడు కిలోమీటర్లు రోడ్డును నిర్మించాల్సి ఉంటుందని అన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని విరమించి ఎప్పటి లాగానే గ్రామం మధ్యలో నుంచి రోడ్డు వేయడం వలన కొంత నష్టమే జరుగుతుందని రైతులు వివరించారు. రైతుల బాధలు విన్న ఆర్డీవో విషయాన్ని జిల్లా కలెక్టర్ కు వివరిస్తానని చెప్పారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఆర్టీసి కాలనీవాసులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆర్టీసీ కాలనీవాసులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాణిక్ బండార్ గ్రామ శివారులోని ఆర్టీసీ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎస్.రాజేందర్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని అంకాపూర్ నివాసంలో ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా ఎమ్మెల్యేనీ ఆర్టీసీ కాలనీ తరుపున శాలువాతో సత్కరించి, ఆర్టీసీ కాలనీలోని డ్రైనేజీలు, సీసీ రోడ్లు, పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్, పార్క్ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, శ్మశాన వాటికలో ప్రహరీ గోడ, నీటి వసతి, స్నానం గదులు ఏర్పాటు చేయుటకు నిధులు మంజూరు చేయించి పనులు జరిగేలా చూడాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డినీ ఆర్టీసీ కాలనీ తరుపున కోరారు. ఎమ్మెల్యేపై సమస్యలపై స్పందించి వారు త్వరలోనే పనులు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యేను ఆర్టీసీ కాలనీకి రావలిసిందిగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కాలనీ కోశాధికారి ఎస్.గంగాధర్, ఆలయ కమిటీ అధ్యక్షులు జి.హన్మంత్ రెడ్డి, కోశాధికారి డివి.రాములు, ఆలయ కమిటీ గౌరవ సలహాదారులు ఏ.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మిమిక్రీ ప్రాణంగా

- నువ్వులను పంచుతున్న శంకర్ • నేడు అంతర్జాతీయ మిమిక్రీ దినోత్సవం • జిల్లా నుంచి రాణిస్తున్న ఎందరో మిమిక్రీ కళాకారులు



అవార్డు అందుకుంటున్న శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ సాంస్కృతికం ఆ వేదిక వద్ద పెద్దగా నవ్వులు, చప్పట్లు వినిపిస్తున్నాయి అంటే అక్కడ ఎవరో మిమిక్రి కళాకారుడి ప్రదర్శన ఉన్నట్టే! రామాయణంలోని మరీశుడిని అనుసరిస్తూ నేరెళ్ళ వేణు మాధవ్ చేసిన ధ్వనుకరణ ఓ కళగా రూపాంతరం చెందింది. ఈ ధ్వని అనుకరణ కళలో ఎందరెందరో కళాకారులు తమదైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ కళా ప్రేమికులకు నవ్వులు పంచుతున్నారు. తద్వారా విశ్వ జనులను ఆరోగ్యం ప్రపంచంవైపు నడిపిస్తున్నారు. 64 కళలలో అద్భుత కళా ధ్వననుకరణ, మరో వ్యక్తికి చెందిన మాటలు, ధ్వనిని, గొంతును తన గొంతుతో పలికించడమే ఈ కళ గొప్పతనం. నిత్యం తమ పనుల్లో నిమగ్నమై ఉండే ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని చేకూర్చే ఈ కలాంశంలో ఎందరో కళాకారులు రాణిస్తున్నారు. సరదాగా అందరినీ కడుపుబ్బ నవ్వించే మిమిక్రీ ఎంతో దోహదపడుతుంది. ఇది ఎంతో ప్రజాదరణ పొందిన కళ. ప్రజలకు బాగా పరిచయం ఉన్న వ్యక్తుల గొంతులను అనుకరించడం, పక్షులు పశువులు, వాహనాలు, వివిధ రకాల ధ్వనులను ఒకే గొంతుతో వినిపిస్తూ శ్రోతలను ఆనంద పరచడమే కళాకారుల గొప్పతనం. మొట్టమొదటి సారిగా

1985లో హైదరాబాద్‌లోని గోషామహల్ పాఠశాలలో చదువుకుంటున్న సమయంలో గిన్నిస్‌బుక్ రికార్డు సాధించిన మిమిక్రీ శ్రీనివాస్ వచ్చిన కార్యక్రమం శంకర్‌ను మిమిక్రీ వైపు దష్టి మరల్చింది. శ్రీనివాస్ వద్ద నేర్చుకుని 1988నుండి చిన్నపిల్లవాడి నుండి పండు ముసలి వరకు కడుపునిండా నవ్వేలా మిమిక్రీ అనుక రించేవాడు. మిక్స్ మిమిక్రీ, వెంట్రాలాక్విజం, వ్యక్తిత్వ వికాసం మాట్లాడే బొమ్మలు (చింపాంజి, కోతి, బాతు), మ్యాజిక్ డ్యాన్సతో పాటు పలు రాజకీయ నాయకుల, సినీ నటుల గొంతులను అనుకరిస్తారు. 1991 డిసెంబర్ 28న నేరెళ్ల వేణుమా దవ్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈఅద్భుత కళా ధ్వనుకరణ అలాంటి అద్భుత కళారంగంలో ఇందూరు వాసులు సత్తా చాటుతున్నారు. ధ్వనుకరణ కళలో విశ్వవ్యాప్తంగా ఖ్యాతిని గడించిన నేరెళ్ల వేణు మాధవ్ పుట్టినరోజునే మిమిక్రీ కళా జగత్తు ప్రత్యేక దినోత్సవంగా నిర్వహిస్తోంది. సోమవారం ప్రపంచ మిమిక్రీ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లాలోని ఇందల్ వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన శంకర్.

నిజామాబాద్ జిల్లాలోని ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన శంకర్ దివ్యాంగ కళాకారుడు. పూరి గుడిసెలో ఉంటూ ఎంచుకున్న కళనే ఇంటిపేరు మిమిక్రీ శంకర్‌గా పేరొందాడు. తన వైకల్యాన్ని తలుచుకుంటూ కుమిలి పోలేదు. నలుగురు మెచ్చే కళారంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్నాడాయన. శబ్దాలను అనుకరిస్తూ, పలు రంగాల ప్రముఖుల ప్రశంసలు పొందుతు న్నారు. తెలుగు భాష అభివృద్ధి కోసం పాఠశాలలు, కళాశాలలు, గ్రామీణ ప్రాంతాలతోపాటు పలు అధి కార కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇస్తూ, అవగాహన కల్పిస్తున్నారు. విశ్వవిఖ్యాత మిమిక్రీ సామ్రాట్ నేరె ళ్ళ వేణు మాధవ్ ప్రియ శిష్యుడు. గిన్నిస్ రికార్డ్‌కు ఎక్కిన శ్రీనివాస్ వద్ద కొంతకాలం శిష్యరికం చేసిన శంకర్ ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు, జిల్లా ఇతర ప్రాంతాల్లోనూ ప్రదర్శనలు ఇస్తు న్నారు. మిక్స్‌డ్ మిమిక్రీ వ్యాఖ్యాతగా, వెంట్రిలాక్వి జంలోనూ శంకర్ తనకుతానే సాటి అనిపించు కుంటున్నారు. తను నేర్చుకున్న అదే కలలో జీవి స్తూ తన జీవన విధానాన్ని సాగిస్తున్నాడు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎదురొడ్డి పోటి ప్రపంచంలో ముందుకు సాగుతున్నాడు. అందరు నవ్వుతూ బతకాలని ఆకాంక్షిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా పలు అంశాలపై ఇప్పటివరకు 11 వేల పై చిలుకు ప్రదర్శనలు ఇచ్చాడం టే ఆశ్చర్యపోవలసిన విషయమే

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు..

ప్రశంసా పత్రాలు, అవార్డులు అందినంత మాత్రాన కుటుంబాలను నెట్టుకోలేమని, ప్రభుత్వ పాలకులు వీరిని ఆదుకోవడానికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించి పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములను చేసి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత కొన్ని ఏళ్ళ క్రితం ఉపాధి హామీ పథకంలో మల్లాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఇంత చేస్తున్నా ఉండటానికి ఇల్లు లేక చిన్న షెడ్డులోనే కాలం వెళ్లదీస్తున్నా డు. వికలాంగుల కోటాలో ఇళ్లు నిర్మించి, ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని, రాబోవు రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయనుంది. గ్రామాల్లో పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇలాంటి కళాకారులకు ఉద్యోగం ఇస్తే పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చేరుతాయనే దానిలో ఎలాంటి సందేహం లేదు. ప్రభుత్వం స్పందించి మిమిక్రీ ఆర్టిస్టులకు సరైన ప్రోత్సాహం అందిస్తే ఇంకా ఎన్నో విజయాలు తన సొంతం చేసుకుంటానని ధీమా వ్యక్తంచేశారు. లేకుంటే కళలు మరుగున పడిపోయే ప్రమాద ముందని గతంలో మిమిక్రీకి తగిన గుర్తింపు లభించలేదని, మిమిక్రీ ప్రదర్శన చేస్తే వచ్చేది వెయ్యి, రెండు వేల రూపాయల్లో కుటుంబం నడవడం గగనమై పోయిందని శంకర్ అవేదన వ్యక్తం చేశారు.

మిమిక్రీ ప్రయాణంలో జిల్లాకు వచ్చే కలెక్టర్‌లో ద్వారా సన్మానం పొందడం తప్ప ఏమీ లేదని, రాష్ట్రం వ్యాప్తంగా పలు రంగాల ప్రముఖుల నుంచి ప్రశంసలు, పలు సంస్థల నుంచి అవార్డులు ప్రశంసలు అందుకున్నారు. దీంతో కడుపు నిండదని, మాలాంటి వారికి గుర్తించి సాంస్కృతిక శాఖలో ఉద్యోగం కల్పించాలని శంకర్ వేడుకుంటున్నారు.

రామాయణంలోని మారిశరిడిని అనుసరిస్తే నేరెడ్ల వేణుమాధవ్ చేసిన ధ్వనిఅనుకరుణ గొప్ప కళగా రూపాంతరంగా చెందింది. ఈ కళ ద్వారా విశ్వ జనులను ఆరోగ్యప్రపంచం వైపు నడుపిస్తున్నారు. 64 కళల్లో ధ్వని అనుకరణ మరో వ్యక్తికి చెందిన మాటలు ధ్వనిని గొంతును తన గొంతుతో అనుకరించడమే కళ గొప్పతనం. ప్రజలకు ఉల్లాసాన్ని చేకూర్చే కళ అద్భుతమైనది.

జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మిమిక్రీ శంకర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్రాంతి సంబరాలు న్యూ ఢిల్లీ 14, 15 2023తేదీలో చిలుక బొమ్మ, బాతు బొమ్మ, నతం మిమిక్రి చేసినందుకు శ్రీ ఆదిత్య నాథ్ దాస్-ఐఏఎస్ ఘనంగా సత్కరించారు. భారత్ వరల్డ్ రికార్డ్ భవిరి ఆర్ట్స్ మయూరి ఆర్ట్స్ మెగాస్టార్ చిరంజీవి కంఠానికి భారత్ వరల్డ్ రికార్డ్‌తో సత్కారం జులై 22 రవీంద్ర భారతి 2019 హైద్రాబాద్‌లో పొందారు. బాతు బొమ్మతో చిరంజీవి గ్యాంగ్ లీడర్ పాటకు డాన్స్ చేశారు. ఈ డాన్స్‌కు 2/5/2019న మాజీ గవర్నర్ హాయ్ రేంజ్ వరల్డ్ రికార్డ్ అవార్డుతో సత్కరించారు.

మాయ వినోదం

మాజిక్. మిమిక్రీ మై ఫెస్టివలో సీనియర్ మిమిక్రీ కళాకారుడిగా గురుమాత ద్వారా సత్కారం 1988లో పొందారు. నుంచి నేటివరకు 11వేల. పైగా ప్రదర్శ నలు పూర్తి మిక్స్ మిమిక్రి వ్యాఖ్యాతగా వెంట్రిలాక్విజమ్‌లో తనకు తనే సాటి.

తండ్రి బాటలో తనయ భార్గవి..

మిమిక్రీ శంకర్ కూతురు భార్గవి భర్త బుధచరణ్ కళారంగంలో గుర్తించి తన ప్రతిభకు సహకారం అందిస్తున్నాడు. మిమిక్రి వెంట్రిలాక్విజమ్ ప్రదర్శనలు చేస్తూ అందరి మన్ననలు పొందుతుంది. హైదరాబాద్ మావా కన్వీనర్ చంద్రముఖి చంద్రశేఖర్ అద్వారంలో వెంట్రిలాక్విజమ్‌లో ప్రదర్శన నిర్వహించారు.

మిమిక్రీ శంకర్ కూతురు భార్గవి సైతం కళారంగంలో ప్రతిభను చాటుతూ తండ్రికి తగ్గ తనయ అనిపించుకుంటుంది. మిమిక్రీ వెంట్రిలాక్విజం, దాండియా నత్యం తదితర కళలలో నైపుణ్యం ప్రదర్శిస్తోంది. పదోతరగతి నుండి డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ (డి) జిల్లా పరిషత్ పాఠశాలలో, ఇంటర్ డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే రోజుల్లోనే మిమిక్రీ నేర్చుకుంది. మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్‌లో పీజి చేస్తుంది. యూనివర్సిటీలో మిమిక్రీ కళా ప్రదర్శన ఇచ్చి అవార్డు అందుకుంది. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటింది. జిల్లా కలెక్టర్‌తో శభాష్ అనిపించుకుంది.



మిమిక్రీ చేస్తున్న భార్గవి

చైతన్యమే లక్ష్యంగా మిమిక్రీ

- నేడు ప్రపంచ మిమిక్రీ దినోత్సవం సందర్భంగా

నవతెలంగాణ-ఆర్మూర్

పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా మిమిక్రీ దినోత్సవం జరుపుకుంటారు. నవ్వించడమే కాకుండా చైతన్యమే లక్ష్యంగా మిమిక్రీ చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.. నేడు ప్రపంచ మిమిక్రీ దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణ కథనం...

15 సంవత్సరాల వయసులోనే...

1932 డిసెంబర్ 28 వరంగల్ జిల్లాలోని మట్టేవాడలో జన్మించిన వేణుమాధవ్ 15 సంవత్సరాల వయసులోనే మిమిక్రీ తో అందరిని అలరింప చేశారు. తెలంగాణ ఆవిర్భావానికి ముందు 1971లో వేణుమాధవ్ ఎమ్మెల్సీగా పని చేశారు. 2001లో పద్మశ్రీతో అనేక అవార్డులు అందుకున్నారు. జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం వేణు మాధవ్ ను ఘనంగా సత్కరించింది. 2018 సంవత్సరం ఆయన స్వగహంలో మరణించారు.

కొన్ని సంవత్సరాల నుండి..

2016సంవత్సరం జిల్లా కేంద్రంలోని కావ్య విద్య విశాఖ సమైక్య ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆనంద్‌కు మిమిక్రీ స్టార్ బిరుదును ఇచ్చి సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మిమిక్రీ కళారత్న బిరుదు ఇచ్చి సత్కరించారు. 2017లో జిల్లా కేంద్రంలోని నెహ్రూ యువ కేంద్రం మిమిక్రీ శిక్షణలో భాగంగా వేణు మాధవ్ చేతుల మీదుగా ఉత్తమ మిమిక్రీ అవార్డు సర్టిఫికెట్ అందుకున్నారు. గత జిల్లా కలెక్టర్లు, ఎస్పీలుగా పనిచేసిన వారినుండి ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. 2021లో తెలుగు వెలుగు సమైక్య ఆచార్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ మేయర్ ఆకుల సుజాత ద్వారా మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. గత సంవత్సరం జిల్లా కేంద్రంలోని జిఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ మిమిక్రీ ఆర్టిస్టుగా అవార్డును అందుకున్నారు.

ఉచితంగా మిమిక్రీ నేర్పిస్తున్నా..



తన గురువు మెజీషియన్ రంగనాథ్ తో కలిసి మ్యూజిక్ మిమిక్రీ ప్రోగ్రాం ఇస్తూ విద్యార్థులకు ఉచితంగా మిమిక్రి విద్యను నేర్పిస్తున్నాను. ఇకముందు ఎవరైనా మిమిక్రీ నేర్చుకోదలచిన వారికి ఉచితంగా నేర్పిస్తాను.

బొండ్ల ఆనంద్, మిమిక్రీ కళాకారుడు, ఆర్మూర్.

అంకాపూర్‌కు చెందిన కోకిల నాగరాజు

మండలంలోని అంకాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోకిల నాగరాజు మిమిక్రీలో రాణిస్తూ పలువురి ప్రశంసలు పొందుతున్నాడు. ఏ గురువు వద్ద శిక్షణ తీసుకోకుండానే కేవలం సాధన ద్వారా మిమిక్రీ వెంట్రిలాక్విజం చేస్తూ వేల ప్రదర్శనల ద్వారా ఆకట్టుకుంటున్నాడు. ఆడ, మగ రెండు గొంతులతో పాటలు పాడటం నాగరాజు ప్రత్యేకత. గతంలో జీ తెలుగు లో ప్రసారమైన సత్తా చూపించు బాసు కార్యక్రమంలో నాగరాజు అద్భుతమైన మిమిక్రీ,, జెమిని టీవీలో పాపులర్ అయిన వన్స్ మోర్ ప్లీజ్ మిమిక్రీ షోలో నాగరాజు రెండు పర్యాయాలు చేసి అందరిని అలరింప చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అంకాపూర్ వచ్చినప్పుడు సైతం నాగరాజును అభినందించడం జరిగింది.



నాగరాజును అభినందిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

చైతన్యమే లక్ష్యంగా మిమిక్రీ చేస్తున్న బొండ్ల ఆనంద్

పట్టణంలోని పెద్ద బజారుకు చెందిన బొండ్ల ఆనంద్ తన గురువైన జాదు యుగంధర్ మెజీషియన్ రంగనాథ్ వద్ద మిమిక్రీలో శిక్షణ తీసుకొని జిల్లా వ్యాప్తంగా ఎన్నో మిమిక్రీ ప్రోగ్రాములు ఇచ్చి ప్రశంసలు పురస్కారాలు అందుకున్నారు. ఏకధాటిగా 100 రకాల గొంతులను అవలీలగా అనుకరించి ప్రదర్శిస్తారు. ఎందరో ప్రముఖ రాజకీయ నాయకుల సిని ప్రముఖుల గొంతులను మన ముందే ఉన్నట్టు మిమిక్రీ చేసి అందరిని ఆకట్టుకుంటాడు. ఉమ్మడి జిల్లాల్లో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఎయిడ్స్ నిర్మూలనపై యువతను జాగతం చేస్తూ ఆర్టీసీ వారు నిర్వహించే రోడ్డు ప్రమాదాలు అరికట్టడం తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమంలోఎన్నో ప్రదర్శనలు మిమిక్రీ ప్రోగ్రాంలు వచ్చారు. ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల్లో భాగంగా జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.



నేరేళ్ల వేణుమాధవ్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న ఆనంద్



మాట్లాడుతున్న డీఆర్డిఓ చందర్ నాయక్

పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డిఆర్డిఓ చందర్ నాయక్

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ 15 వ విడత సామాజిక తనిఖీ, గ్రామ సభల్లోని అంశాల నివేదికపై బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ లావణ్య లింగాగౌడ్ ఎంపీడీవో సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజా వేదిక సభ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చందర్ నాయక్ సమక్షంలో నిర్వహించారు. క్షేత్రస్థాయిలో జరిగిన సామాజిక తనిఖీలకు సంబంధించి డిఆర్‌పిటలు ఈ సభలో 10 గ్రామాల్లో 01.04.2022 నుండి 31.03.2023 వరకు జరిగిన పనులపై మూడు కోట్ల 38 లక్షల ఇరవై మూడు వేల 514 రూపాయల పనుల తనిఖీ వివరాలను అధికారులకు చదివి వినిపించారు. ఉపాధి హామీ పనులపై కొన్ని గ్రామాల్లో కూలీలు పనిచేసిన రోజుల కంటే ఎక్కువ రోజులకు డబ్బులు చెల్లించడం, కూలీలు పనిచేసిన కానీ డబ్బులు చెల్లించకపోవడం, జాబ్ కార్డ్ అప్డేట్ నిర్వహణలో లోపాలు ఉండటం, ఫోటోలు సేకరించడంలో నిర్లక్ష్యం, ఏపీఓ, ఎంపీడీవో రోల్ కాల్ చేయడం లేదని, రిజిస్టర్ మెయింటెనెన్స్‌లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఉపాధి హామీ పనులలో జరిగిన లోపాలను తనిఖీ బృందం వారు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, ఏపీఓ ఇందిరా, ఫారెస్ట్ అధికారులు సౌమ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించపోతే తొలగిస్తాం డీఆర్‌డిఓ చందర్ నాయక్

పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మస్టర్ నిర్వహణలో గాని, కూలీల సంతకాలు తీసుకోవడంలో గాని, మండల స్థాయిలో కంప్యూటర్ సెంటర్‌లో జరిగిన తప్పిదాలపై ఉపాధి హామీ సిబ్బందికి హెచ్చరించాం. ఇకముందైనా గ్రామాల్లో మొక్కలు ఎండిపోతే వాటిని తొలగించి అక్కడ వేరే మొక్కలు నాటాలని అన్నారు. ప్రతి గ్రామంలో సక్రమంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కు సంబంధించిన పనులు సక్రమంగా నిర్వహించాలి. లేకపోతే వారిని విధుల నుండి తొలగిస్తాం.

నవతెలంగాణ
కామారెడ్డి
గురువారం | డిసెంబర్ 28, 2023 | www.navatelangana.com

సోలార్ లైట్ సెట్ ప్రారంభం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో గల బస్టాండ్ సమీపంలో సోలార్ లైట్ సెట్‌ను జడ్పిటిసి మేక విజయ సంతోష్ ప్రారంభించారు. జిల్లా పరిషత్ నుంచి రూ.1,50,000 నిధులతో సోలార్ లైట్లు ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్థ సాయిరెడ్డి, ఎంపీటీసీ రాధా, ఉపసర్పంచ్ ఫిరోజ్ ఉద్దీన్, శక్తి కేంద్రం ఇంచార్జి పార్థ రమేష్, ఐలన్న, నరేష్, గుండ్ల పోశెట్టి, స్థానిక నాయకులు గంగాధర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడికి గాయాలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా గ్రామపంచాయతీ కార్మికుడు చెత్త బండిపై తమ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు జారిపడి కాలు విరిగిందని జిల్లా అధ్యక్షులు రాజేష్, ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి, కార్మికులకు ఇన్సూరెన్స్ కట్టలేనందున నేడు ఈ కార్మికుడి కుటుంబం రోడ్డున పడిందన్నారు. ఇన్సూరెన్స్ కట్టని కార్యదర్శిపై జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కార్మికుడు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు.



గాయపడిన కార్మికుడు

దరఖాస్తు స్వీకరణలో నిర్లక్ష్యం వద్దు

- **అధికారులు, ప్రజాప్రతినిధుల సూచన**
- **కార్యదర్శులకు అవగాహన**

నవతెలంగాణ-విలేకరుల బృందం

దరఖాస్తు స్వీకరణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామ కార్యదర్శులకు, ఇతర సిబ్బందికి సూచించారు. నేటి పలు పథకాలకు దరఖాస్తు స్వీకరించనున్న నేపథ్యంలో బుధవారం అవగాహన కల్పించారు.

రెంజల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలనపై ప్రజాప్రతినిధులకు, గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించినట్టు మండల ప్రత్యేక అధికారి వాజిద్ హుస్సేన్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రజాపాలన దరఖాస్తులు ప్రభుత్వమే సరఫరా చేస్తుందని, దానిలో ప్రశాంతంగా దరఖాస్తులు పూర్తి చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలపై కొట్టివేతలు, దిద్దుబాటు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజా పాలనలో అర్హత గల వారందరూ వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తప్పకుండా జత చేయవలసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రజని కిషోర్, తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, హెచ్‌ఈఓ కరిపే రవీందర్, ఇన్చార్జి ఎపిఓ భాస్కర్, పిఆర్ఏఈ వినయ్‌కుమార్, సర్పంచులు ఎమ్మెస్ రమేష్ కుమార్, మీర్జా కలీం బేగ్, జాదవ్ గణేష్ నాయక్, ముళ్ళపూడి శ్రీదేవి, రోడ్డ విజయ లింగం, గ్రామ కార్యదర్శులు రాజేందర్‌రావ్, మహబూబ్ అలీ, రాఘవేందర్‌గౌడ్, శ్రీకాంత్, సుమన్, సిహెచ్. సాయి, జి.నవీన్, శివకృష్ణ రాజు, రాణి, రోజా, రజిత, మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, ప్రసాద్, కవిత, అజయ్, గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ : ఎంపీపీ

భిక్కనూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 6 గ్యారంటీలు అమలు చేయడం కోసం నేటి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఎంపీపీ గాల్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో అనంతరావు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనంతరావు మాట్లాడుతూ దరఖాస్తు ఫారాలను ప్రభుత్వం అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, ఐకెపి సిబ్బంది ద్వారా ఇంటింటికి పంపిస్తామని, దరఖాస్తు ఫారాలను నింపి స్థానికంగా ఏర్పాటు చేసే ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులను అందజేయాలన్నారు. తొలి విడతగా వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, ప్రజా పాలన లో భాగంగా అర్హులైన వారిని గుర్తించి ప్రతి నాలుగు నెలలకు ఒకసారి గ్రామ సభలను ఏర్పాటు చేసి అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, వైస్ ఎంపీపీ యాదగిరి, ఎంపీఓ ప్రవీణ్ కుమార్, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పకడ్బందీగా చేపట్టాలి..

నాగిరెడ్డిపేట్: ఆరు గ్యారెంటీలపై దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు ఆయా శాఖలకు చెందిన అధికారులతో మండలస్థాయి అధికారులు, ఎంపీపీ, జడ్పిటిసి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి నుంచే ప్రారంభం కానున్న 6 గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ వచ్చే నెల 6 తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభలలో దరఖాస్తులు స్వీకరించాలని పేర్కొన్నారు. గ్రామాల సభ నిర్వహించే తేదీ ఉంటుందో దానికి సంబంధించి ఒకరోజు ముందే ప్రతి ఇంటికీ 6 గ్యారంటీల దరఖాస్తు ఫారం అందజేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజదాసు మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వారి వద్ద రేషన్‌కార్డు లేకపోయినా ఆధార్ కార్డుతో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించి దరఖాస్తులను స్వీకరించాలని ఆయన సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతర శాఖల సిబ్బందిని కూడా కార్యక్రమంలో భాగస్వాములు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ 28వ తేదీ నుంచి జనవరి ఆరవ తేదీ వరకు జరుగుతుందని ఎవరు కూడా తొందరపడే అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, ఎంపీయూ శ్రీనివాస్, తహసీల్దార్ మహేందర్ కుమార్, ఏవో విజయ శేఖర్, ట్రాన్స్‌కో ఏఈ నిరంజన్, ఆయాశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గాంధారి: మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, విద్యుత శాఖ, వ్యవసాయ శాఖ, అంగన్వాడీ టీచర్స్, ఆశావర్కలకు, ప్రజాపాలన అంశంపై గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరణ చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. 28.12.2023 నుంచి 06.01.2024 వరకు ప్రజాపాలన ఉంటుందని పేర్కొన్నారు. కాగా బుధవారం వివిధ అంశాలపై తహస్దార్ జానకి, ఎంపిడివో సతీష్ కుమార్, ఎంపివో రాజ్‌కిరణ్ అధికారులకు అవగాహనా సదస్సును నిర్వహించారు.

వర్ని: చందూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నీలావతి సమక్షంలో నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు జరిగే ప్రజా పాలనలో ప్రజలతో చర్చించే సమస్యలపై, కమిటీ ఏర్పాటుపై ఆమె అధికారులతో, ప్రజాప్రతినిధులతో చర్చించారు. గ్రామలలో ఏర్పాటు చేసే ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఐదు గ్యారంటీల అప్లికేషన్‌ల స్వీకరణ చేయాలని, పేదలకు సంక్షేమ పథకాలు అందేలా పేదల వివరాలు పక్క నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దశగౌడ్, కో ఆప్షన్‌మెంబర్ తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూర్: మాట్లాడుతున్న ఎంపీపీ గాల్‌రెడ్డి



నాగిరెడ్డిపేట్ : మాట్లాడుతున్న జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి



వర్ని: మాట్లాడుతున్న ఎంపీడీవో నీలావతి

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువజన సంఘం సభ్యులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దగుల్ల గ్రామంలో దత్తజయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించినట్టు రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి దస్తీరాం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని విశ్వహిందుపరిషత్, భజరంగ్‌దళ్, యువజన సంఘం సభ్యులు భారీగా పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 39 మంది యువకులు రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయాలి

- **అఖిలభారత ప్రగతిశీల సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్**



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గంగాధర్

నవతెలంగాణ-ఎడపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయాలని అఖిలభారత రైతు ప్రగతి సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. అలాగే అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. మండలంలోని అంభం(వై) గ్రామంలో బుధవారం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించిందని, అధికారం చేపట్టి 20 రోజులవుతున్నా ఇప్పటికీ రైతుల ఖాతాల్లో రైతుబంధు వెయ్యలేదన్నారు. కార్యక్రమంలో హనుమాన్లు, సుదర్శన్, కొండెంగల గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ వికారా పాషా

నవతెలంగాణ-రెంజల్

వాతావరణ పరిస్థితులను దష్టిలో ఉంచుకుని గ్రామ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దష్టి సారించాలని సర్పంచ్ వికార్ పాషా స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని సాటాపూర్ గ్రామపంచాయతీలో పాలకవర్గ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చలి ఎక్కువగా ఉండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మురికి కాలువలను శుభ్రం చేయాలని, పరిశుభ్రతను పాటించాలని ఆయన పారిశుధ్య కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కంఠం గంగారం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

- **లేకుంటే కనెక్షన్లు తొలగిస్తాం**
- **విద్యుత్‌శాఖ అధికారుల హెచ్చరిక**

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ మండలంలోని జనగామ గ్రామానికి చెందిన రైతులు విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే రైతుల పొలాల వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్లు బంద్ చేస్తామని, ఇంటి బిల్లులు చెల్లించని వారి ఇంటి కనెక్షన్లను తొలగిస్తామని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము గత వారం రోజులుగా బోరు బావుల వద్ద బిల్లులు వసూలు చేయడానికి వస్తున్నామని, ఎవరూ బిల్లులు కట్టడం లేదని తెలిపారు. కావున పై అధికారుల ఆదేశాల ప్రకారం.. బిల్లులు కట్టని యెడల ట్రాన్స్‌ఫార్మర్లు బంద్ చేస్తామని హెచ్చరించారు. అలాగే లింక్ సర్వీస్ కింద ఇంటికి కనెక్షన్ కూడా తొలగిస్తామని, విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండాలంటే పెండింగ్ విద్యుత్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-దోమకొండ

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లింగుపల్లి గ్రామంలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని గ్రామాల అభివద్ధి కోసం కేంద్రం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేష్, రవీంద్రర్, యాస్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగిరెడ్డిపేట్ బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేట్ గ్రామానికి చెందిన చాకలి బాబు (50) గత కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లి కూలీ పని చేసుకుంటూ ఉండేవాడు. తాగుడుకు బానిసై ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. మంగళవారం తన ఇంట్లో ఉన్నాడని బుధవారం తెల్లవారినా ఇంట్లో నుంచి రాకపోవడంతో తన సోదరుడు యాదగిరి వెళ్లి చూడగా తన ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఉండటంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి తమ్ముడు యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మతునికి భార్య లలిత, ఇద్దరు పిల్లలున్నారు.

పొగమంచులో వాహనాలు జాగ్రత్తగా నడపాలి

- **బాన్సువాడ డిఎస్‌పి జగన్నాథ రెడ్డి**

నవతెలంగాణ-బిచ్కుంద/నాగిరెడ్డిపేట్

ఉదయం సమయంలో పొగ మంచు కారణంగా రహదారి కనబడక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని బాన్సువాడ డిఎస్‌పి జగన్నాథ రెడ్డి తెలిపారు. పలు సూచనలు పాటించి పొగ మంచులో వాహనాలు జాగ్రత్తగా నడిపి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని సూచించారు. పొగ మంచు ఉన్నప్పుడు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అనుసరించాల్సిన ముఖ్యమైన విషయాలను డిఎస్పి సూచించారు. వాహనాలకు హెడ్ లైట్ తప్పనిసరిగా వేయాలని పొగ మంచులో ఓవర్టేక్ చేయరాదని మీ వాహనం వెళ్తున్న లైన్‌లోనే వెళ్తు ఎదురుగా వస్తున్న వాహనాల శబ్దాలను అనుసరించి జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని తెలియజేశారు. వాహనాల మధ్య దూరం పాటించి రహదారిపైనే దష్టి కేంద్రీకరించాలని ఈ కొద్దిపాటి జాగ్రత్తల వల్ల ప్రమాదాల బారిన పడకుండా తమను తాము కాపాడుకోవచ్చని సూచించారు.

వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త వహించాలి : ఎస్సై రాజు

నాగిరెడ్డిపేట్: పొగ మంచు కారణంగా ఉదయం పూట రోడ్డు ప్రమాదాలు చాలా జరుగుతున్నాయని నాగిరెడ్డిపేట్ ఎస్సై రాజు అన్నారు. రోడ్డు ప్రమాదాలపై బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డుపై నడిపేటప్పుడు ముఖ్యంగా ఉదయం పూట చాలా జాగ్రత్తగా వాహనాలను నడపాలని ఆయన పేర్కొన్నారు. వాహనం నడిపే సమయంలో దష్టి అంతా రోడ్డుపైనే ఉంచాలని ఆయన పేర్కొన్నారు. వాహనానికి తక్కువ దూరంలో హెడ్‌లైట్లను వెలుతురు పడేవిధంగా పెట్టుకోవాలన్నారు. ఎదురుగా వచ్చే వాహనాల వేగాన్ని మనం గమనించకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. వాహనం నడిపేటప్పుడు ముఖ్యంగా ఓవర్టేక్ చేయకపోవడం చాలా మంచిదని పేర్కొన్నారు. ఉదయం పూట తక్కువ వేగంతో చాలా జాగ్రత్తగా వెళ్లాలని తెలిపారు.

ప్రజలకు పాదాభివందనం

- **గెలిపించినందుకు ధాన్యవాదాలు**
- **ప్రతి కార్యకర్తనూ గుండెల్లో పెట్టుకుంటా**
- **విజయోత్సవ సభలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు**

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/మద్నూర్

తనపై విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించిన జుక్కల్ ప్రజలకు పాదాభివందనాలు తెలుపుతున్నానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, ప్రజలు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాల వేశారు. అనంతరం మండల నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం (విజయోత్సవ సభ)లో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ తగిన ఫలితం ఉంటుందని, ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుంటానని అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని భరోసా ఇచ్చారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే నియోజకవర్గ వర్గాన్ని ఎక్కడా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. పెద్దకొడప్‌గల్ మండలం చాలా వెనుకబడిందని, అధికారపార్టీ నాయకులతో ఇక్కడి ప్రతిపక్ష నాయకుడు కుమ్మక్కై వారికి అమ్ముడుపోవడమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని రోడ్లు, విద్యా, వైద్యం, ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తానని ప్రజలు కూడా అందరూ తమ వంతుగా బాధ్యతతో నియోజకవర్గ అభివృద్ధిలో తనకు సహకరించాలని కోరారు. గుడులతో సమానంగా బడులకు కూడా ప్రాధాన్యత ఇస్తేనే మన పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఆయన సూచించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో రివ్యూ మీటింగ్‌లు నిర్వహించానని, ఈ మధ్యే ప్రభుత్వ కార్యాలయాలను, ఆసుపత్రులను తనిఖీ చేశానని చెప్పారు. ఏ ఒక్క అధికారీ సక్రమంగా విధులు నిర్వహించటం లేదని అన్నారు. ఇక నుంచి వాళ్ళతో ఎలా పని చేయించాలో తనకు బాగా తెలుసునని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలను అమలు చేశామని, రాబోయే రోజుల్లో ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ ఖండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ ఉప నారాయణ, మోహన్, పండరి, మాణిక్‌రెడ్డి, మల్లప్ప పటేల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం కోసం ప్రజల వద్దకే పాలన..

మద్నూర్: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకోసం ప్రజాసంక్షేమం కోసం ప్రజల వద్దకే పాలన చేపట్టేందుకు.. ఈ నెల 28 నుంచి వచ్చే నెల జనవరి ఆరవ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి విజయవంతం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు సూచించారు. మద్నూర్ మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో జుక్కల్ నియోజకవర్గం స్థాయి సన్నాహక సమావేశాన్ని అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం చేపట్టే ప్రజాపాలన సదస్సులు విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు పరచేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సన్నాహక సమావేశానికి జిల్లా పరిషత్ సీఈవో సాయగౌడ్, బాన్సువాడ పంచాయతీ డివిజనల్ అధికారి శ్రీనివాస్, మద్నూర్ తహసీల్దార్ ఎండి ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అందర్నీ ఒకే విధంగా చూడొద్దు

- **దాడులు చేస్తున్నాం**
- **కేసులు నమోదు చేస్తున్నాం**
- **ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు**

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ అధికారులందరూ ఒకే విధంగా ఉండరని, ఒకరు చేసిన తప్పును అందరికీ అపవాదించవద్దని కామారెడ్డి ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని పత్రికలలో ఖాకీకి మత్తు మరక, మరో పత్రికలో మరోరకంగా శీర్షికలు వస్తున్నాయని, ఒకరు చేసిన తప్పుడు పనికి అందర్నీ బాధ్యులు చేయడం సరికాదని పేర్కొన్నారు. గత రెండు సంవత్సర కాలం నుంచి అన్ని రకాల మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేస్తూ, ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో మత్తు పదార్థాలకు సంబంధించిన వ్యక్తులను పట్టుకొని డిటిఎఫ్ వారి సహాయంతో సంబంధిత వ్యక్తులను పట్టుకొని సుమారు 513 కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇకపై మత్తుపదార్థాలపై ఉక్కు పాదం మోపుతామని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉండాలని లేని పక్షంలో అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఎన్నికలు ముగిసిన తర్వాత మొదటి సారిగా నిజామాబాద్ కు వస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బుధవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద బిఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, జడ్పీ టీసి సుమన రవిరెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలువేరి దాస్, వైస్ ఎంపీపీ భూసని అంజయ్య, సర్పంచులు, ఎంపిటిసిలు పులి వసంత, చిలువెరి లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తు ఆహ్వానం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర గ్రామంలో గల గురుకుల విద్యాలయాల్లో ఐదవ తరగతి ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టి, బిసి, విద్యార్థులు ప్రవేశ పరీక్షకోసం ఆన్లైన్ దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ జి. మాధవి లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం 1,50వేల లోపు, పట్టణ విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రెండు లక్షలు లోపు ఉండాలని తెలిపారు. ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉంటుందని విద్యార్థులు 100 రూపాయల రుసుం చెల్లించి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరం ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న వారు అర్హులని తెలిపారు. www.tswreis.telangana. gov.in వెబ్‌సైట్ ద్వారా జనవరి 6లోపు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

రేషన్ షాపుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఎమ్మెల్యేను సన్మానించి బొకే అందజేస్తున్న రేషన్ డీలర్లు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రేషన్ షాపుల సమస్యల గురించి ప్రభుత్వానికి తెలుసునని, వాటిని త్వరలోనే సమస్యలు పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలియజేశారని మండల రేషన్ డీలర్ల కార్యదర్శి రమేష్ తెలిపారు. రేషన్ డీలర్ల మండల కార్యవర్గం నూతనంగా ఎన్నికైన సందర్భంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపినట్టు చెప్పారు. రేషన్ షాపుల సమస్యల గురించి ప్రభుత్వానికి తెలుసునని త్వరలోనే సమస్యలు పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి, మరియు మండల రేషన్ డీలర్ల అధ్యక్షులు పెద్ది లక్ష్మణ్, మండల సెక్రెటరీ, జిల్లా కార్యవర్గ సభ్యులు కే రమేష్, సుకూర్ గణేష్, శ్రీనివాస్ గణేష్ శేఖర్, రాజేశ్వర్, లక్ష్మణ్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల హెూల్ సేల్ మార్కెట్‌లో ట్రాఫిక్ అరికట్టాలని వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్‌లోని కొత్తగంజ్ శ్రద్ధనంద్ గంజ్‌లో గల కూరగాయల హెూల్ సెల్ మార్కెట్ లోపలికి బైక్, ఆటోలు, ఇతర పెద్ద వాహనాలు అధికంగా రావడం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, దీన్ని అరికట్టాలని శ్రద్ధానంద్ గంజ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనాల ట్రాఫిక్ వల్ల ముఖ్లె హమాలీలు నడవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రమాదాలు కూడా జరిగిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. గతంలోనూ ఈ సమస్యను తెలుపగా కొన్ని నెలలు ట్రాఫిక్‌ను నియంత్రించారని అన్నారు. మళ్లీ అదే పరిస్థితి కొనసాగుతుందని, మూటలు మోసే హమాలీలకు దెబ్బలు తగులుతున్నాయని, మూటలు జారి కింద పడిపోతున్నాయని, వచ్చే వాహనాల మధ్యలో నుంచి వెళ్లడం కష్టంగా మారుతుందని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ వల్ల బరువు ఎత్తుకొని ముందుకు కదలలేక కొన్ని సందర్భాల్లో వాహనాల మధ్యలో నిల్చునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కావున ట్రాఫిక్ రద్దీని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు మోహన్, రాజు, మల్లేష్, బీరయ్య, రైస్ గంగాధర్, విజయ్, ధర్మయ్య పాల్గొన్నారు.

ఆరుగ్యారెంటీలు ప్రజలకు చేరేలా కృషి చేయాలి



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాలు ప్రజలకు చేరేలా కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి అన్నారు. గురువారం గ్రామాల్లో నిర్వహించే ప్రజా పాలన గ్రామ సభలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముందుండి విజయవంతం చేయాలని తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభయ హస్తం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా నిర్వహించే ప్రజా పాలన గ్రామ సభల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ముందుండి ప్రజల దరఖాస్తులను నింపి, అర్హులైన వారికి పథకాలు దరిచేరాల కృషి చేయాలన్నారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగే ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ 38వ ఆవిర్భావ సభను విజయవంతం చేసేందుకు బాల్కొండ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు గంగారెడ్డి, బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, పడిగెల ప్రవీణ్, సింగిరెడ్డి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బీమాతోనే కుటుంబానికి భరోసా

- సర్పంచ్ లహరి ప్రవీణ్ కుమార్



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-నవీపేట్

లైఫ్ ఇన్సూరెన్స్ బీమాతోనే కుటుంబానికి భరోసా కలుగుతుందని యంచ సర్పంచ్ లహరి ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని యంచ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకు ద్వారా ప్రజలకు చేస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లహరి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గతంలో బ్యాంకు ద్వారా ఇన్సూరెన్స్ పథకంపై అవగాహన కల్పించినప్పటికీ గ్రామస్తులు వినియోగించుకోకపోవడంతో గ్రామంలో ఐదుగురు మృతి చెందిన వారి కుటుంబానికి ఎటువంటి ఆర్థిక సహకారం అందలేదని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు బ్యాంకులో ఖాతా పొంది ఇన్సూరెన్స్ పథకాన్ని పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ గ్రామానికి చెందిన బాజీరెడ్డి గోవన్న సోషల్ మీడియా వారియర్, తెలంగాణ జాగృతి అధ్యక్షులు అజయ్ సంధ్య వివాహ వార్షికోత్సవం సందర్భంగా నిజామాబాద్‌లోని నీలకంఠేశ్వర స్వామి వారి దేవస్థానంలో సతీమణితో కలిసి నిరుపేద వృద్ధులకు అరటి పండ్లు పంపిణీ చేశారు .



వికసిత్ భారత్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

వికసిత్ భారత్‌పై అవగాహన

నవతెలంగాణ-బాల్కొండ

వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చిట్టాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వనజ, అధికారులు కేంద్ర ప్రభుత్వము చేపట్టిన ఈ కార్యక్రమం పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు, పిల్లలకు టీకాలు, ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీ, జనరిక్ మందులు గురించి వివరించారు. షుగర్ బీపీ వ్యాధిగ్రస్తులకు, క్షయ వ్యాధి గ్రస్తులను గుర్తించి ఉచిత మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వనజ గోవర్ధన్ గౌడ్ కిసాన్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి, ఆరోగ్య విస్తరణాధికారి ఆడెపు ప్రభాకర్, ఆరోగ్య కార్యకర్తలు రాజు,లత ఆశకార్యకర్తలు పాల్గోన్నారు.

నిజామాబాద్ పార్లమెంట్ నుంచి ప్రధాని మోడీ పోటీచేస్తే ఆహ్వానిస్తా

- రైల్వే వంతెన నిధులు స్వాహా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- జిల్లా పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఓబి పనులకోసం రాష్ట్ర ప్రభుత్వం వద్ద కేంద్ర ప్రభుత్వం డిపాజిట్ చేసిన 15 కోట్ల నిధులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్ ఆరోపించారు.. మున్సిపల్ పరిధిలోగల గల మామిడిపల్లి లో 773 పనులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపి అరవింద్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఓటుకు 5000 రూపాయలు మాజీ ఆర్అండ్‌బి మంత్రి ప్రశాంత్ రెడ్డి పంపిణీ చేశాడని ఆరోపించారు. త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాలను భారతీయ జనతా పార్టీ గెలుచుకుంటుందని అన్నారు. పార్లమెంట్ స్థానం నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పోటీ చేస్తే ఆహ్వానిస్తానన్నారు. లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై వచ్చిన ఆరోపణలు నిజమైతే తప్పకుండా జైలుకు పంపిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న ఆర్ఓబి పనులపై రాష్ట్ర ఆర్అండ్‌బి శాఖ మంత్రిని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి త్వరలోనే కలుస్తామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో బిజెపి పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో బీజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు ,నాయకులు జీవి నరసింహ రెడ్డి, పల్లె గంగారెడ్డి, ధ్యాగఉదయ్, కంచెట్టి గంగాధర్, పెర్కిట్ దుగ్గి విజయ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..



పనులను పరిశీలిస్తున్న ఎంపీ, నాయకులు, అధికారులు

సంఘ బహిష్కరణ చేస్తే చర్యలు

- నిజామాబాద్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లా అండ్ ఆర్డర్ జయరాం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీడీసీల ఆగడాలపై చెక్ పెట్టడం జరుగుతుందని నిజామాబాద్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లా అండ్ ఆర్డర్ జయరాం బుధవారం తెలిపారు. వీడీసీ సంఘ బహిష్కరణ ఇతర ఎలాంటి ఇబ్బందులు కలిగించిన వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నందిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాపూర్ గ్రామంలో మున్నూర్ కాపు కుల సంఘం వారు అదే కుల సంఘానికి చెందిన ముప్పెడ నడ్పి గంగాధర్ కొద్ది రోజుల క్రితం బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లే సమయంలో తన వ్యవసాయానికి సంబంధించిన కరెంటు మీటరును సమీపంలో వారికి ఇచ్చి వెళ్లారని తెలిపారు. ఈ విషయాన్ని మున్నూరు కాపు కుల సంఘం వారు తమకు తెలుపకుండా కరెంటు మీటరు వేరే వారికి ఇచ్చినందుకు 23-12-2023న 4లక్షల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసులో నందిపేట్ పోలీసులు పూర్తి స్థాయి విచారణ జరిపి తేది 26-12-2023 న ముగ్గురిని అరెస్టు చేసి నిజామాబాద్‌లోని మొబైల్ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. వీరిలో గుర్రపు ముత్తెన్న, గుర్రపు రాములు, ఉప్పరి గంగాధర్ ఉన్నారన్నారు. భవిష్యత్తులో ఎవ్వరికైనా ఇలాంటి జరిమానాలు వేసినట్లయితే వీడీసీ (కుల పెద్దలు) సంఘ బహిష్కరణ, ఇతర ఎలాంటి ఇబ్బందులు కలిగించిన వారిపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. ఎవ్వరిని కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

జాతీయస్థాయి యోగా పోటీలలో విజయ్ విద్యార్థిని

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అస్సాం యోగా అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 48వ జాతీయస్థాయి సబ్ జూనియర్, జూనియర్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ 2023-24 పోటీలు అస్సాం రాష్ట్రంలోని గౌహతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఇందులో విజయ్ హైస్కూల్లో 4వ తరగతి చదువుతున్న జిసి. చెరూబా అమరీస్ సబ్ జూనియర్ విభాగంలో పాల్గొని ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత జాతీయస్థాయి యోగా పోటీలలో పాల్గొన్న జి.సి. చెరూబా అమరీసన్ను అభినందించారు.

రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో విజయ్ విద్యార్థి

రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో విజయ్ విద్యార్థి క్యాంప పతకాన్ని సాధించాడు. హనుమకొండ కిక్ బాక్సింగ్ అసోసియేషన్‌వారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఓపెన్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2023 పోటీలు వరంగల్ లోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9,10వ తేదీలలో నిర్వహించారు. ఈ పోటీలలో 50కేజీల క్యాడెట్ జూనియర్ విభాగంలో విజయ్ హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న బి.అద్వైరావు పాల్గొని కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత రాష్ట్రస్థాయి కిక్బాక్సింగ్లో కాంస్య పతకాన్ని సాధించిన బి.అద్వైరావును ప్రత్యేకంగా అభినందించారు.





విద్యార్థులను అభినందిస్తున్న అమృతలత

ఎమ్మెల్యేను సన్మానించిన పాస్టర్స్ అసోషియేషన్

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం అంకాపూర్ లోని ఎమ్మెల్యే నివాసంలో పైడి రాకేష్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్చం అందించారు. రానున్న రోజుల్లో క్రైస్తవ సంక్షేమం కోసం తన వంతు సహాయం అందించాలని ఆయనను వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తాను కుల మతాలకు అతీతంగా సేవే పరమావధిగా భావించి రాజకీయాల్లోకి వచ్చానని, రానున్న రోజుల్లో మానవత్వంతో క్రీస్తు బోధనలను అనుసరించాలని కోరారు. అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ ప్రకాష్ తో పాటు కార్యదర్శి ఆగస్టీన్, కోశాధికారి షద్రక్ లతోపాటు కార్యవర్గ సభ్యులు, క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.



24 వార్డులో వంద గజాల జాగా కబ్జా

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఏరియాలో గల మున్సిపల్ 24వ వార్డులో 10 శాతం మున్సిపల్ స్థలంలోంచి సుమారు 100 గజాల జాగను కబ్జా చేసి అర్గుల్ శ్రీను వ్యక్తి అనే వ్యక్తి అక్రమంగా ఇంటిని నిర్మిస్తున్నాడని బిజెపి ఆర్మూర్ పట్టణ నాయకులతో కలిసి బుధవారం అక్రమ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. మున్సిపల్ పది శాతం స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్న ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్ దృష్టికి బిజెపి నాయకులు తీసుకెళ్లారు. మున్సిపల్‌లో అక్రమ కట్టడాలను ఆపి మున్సిపల్ శాతం స్థలాలను ప్రజల అవసరాల రిత్యా కాపాడాలని బిజెపి నాయకులు కోరారు. మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన వారిలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవి. నరసింహారెడ్డి, నాయకులు కాందేష్ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా స్థానిక గిరిజనులు నేషనల్ స్కాలర్షిప్ స్కీం క్రింద ఉన్నత చదువులు 2023-24కుగాను (ఫ్రెష్, రెన్యువల్)కోసం గిరిజన విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిజామాబాద్ జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి బుధవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తును ఎుఎు.ంఎ్లశ్రీశ్రీఖతీంష్త్రఱజూం.శ్రీజ.ఱఅ ఆన్లైన్ ద్వారా తేది.31-12-2023 లోపు సమర్పించాలన్నారు.

శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనా సముందర్‌లో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిసాయి. జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు, ప్రజల కోసం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు బద్దం గంగారెడ్డి, ఉపాధ్యక్షులు రుపాల ధర్మాజీ, కార్యదర్శి మేకల శేఖర్, బాలయ్య, క్యాషియర్ కరిపే శేఖర్, గ్రామ కమిటీ సభ్యులు జిన విక్రమ్, పోతుగంట శ్రీధర్, బట్టల మురళి, సొసైటీ చైర్మన్ బాపు రెడ్డి పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో మల్లన్నస్వామి పల్లకి సేవ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో మల్లన్న స్వామి జాతర ఉత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామం నుండి దూల గుట్టపై వెలిసిన మల్లన్న స్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. మల్లన్న స్వామి పల్లకి సేవలో మహిళలు మంగళహారతులతో డోలు,తాళాల చప్పట్లతో ఘనంగా ఊరేగింపు జరిగింది. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించి, అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు పెద్ద ముత్తెన్న, కార్యదర్శి రాజు, మల్కన్న, దేవన్న, సాగర్, సంపత్, చిన్నయ్య, శేఖర్, కుల పెద్ద మనుషులు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో నిర్మిస్తున్న నూతన అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన ఆల్గొట్ (ఇజ్రాయిల్) బలరాం ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.25వేలు విరాళంగా బుధవారం అందజేశారు.విరాళం అందజేసిన ఆల్గొట్ బలరాంకు అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, బద్దం రాకేష్, సురంగి చంద్రశేఖర్, అయ్యప్ప మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో అయ్యప్ప విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు కన్నుల పండుగగా సాగుతున్నాయి. బుధవారం నూతన ఆలయంలో ప్రతిష్టించే అయ్యప్ప విగ్రహానికి జలాలతో, పలు రకాల పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీ వల్లి దేవి సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం కన్నుల పండుగగా జరిపారు. భక్తులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను తిలకించారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నెముక

- అర్బన్ శాసన సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరంలోని ప్రగతి నగర్ మున్నూరు కాపు సంఘంలో భారతీయ జనతా పార్టీ అర్బన్ నియోజకవర్గ కార్యకర్తల కృతజ్ఞతసభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండల లక్ష్మి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మి నర్సయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. బీజేపీకి కార్యకర్తలే పునాదులు అని పేర్కొన్నారు. కమలం జెండాకోసం అహర్నిశలు పనిచేసి నాకోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి నావందనాలని, నా గెలుపులో హిందూబంధువులు పెద్దసంఖ్యలో పనిచేశారని అన్నారు. నా గెలుపునకు ముఖ్య కారణం ప్రతి బూత్ కార్యకర్తఅని తెలిపారు. మనమంతా ఒక కుటుంబ సభ్యులమని తెలిపారు. మీ కష్టాల్లో.. నష్టాల్లో భాగస్వామి అవుతానని, తన గెలుపులో ఎంతో మంది కార్యకర్తలు స్వచ్ఛందగా పనిచేశారని అన్నారు. ఇందూరు అంటే బీజేపీ మాత్రమేనని ప్రజలకు గుర్తుండేలా పని చేస్తానని అన్నారు. నేను స్థానికంగా అందరికి అందుబాటులో ఉంటూ మీకు చిన్న సమస్య వచ్చిన అండగా నిలబడుతానని, పార్టీ కార్యకర్తలను నాయకులను నా గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటానని అన్నారు. నగర అభివృధిలో గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, కార్యకర్తలను ఎంతో ఇబ్బంది పెట్టారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు డబుల్ బెడ్ రూమ్‌లు ఆవాస్ యోజన ద్వారా నగరంలోని ఇండ్లు లేని పేదలకు అందజేస్తానన్నారు. నగరంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి దారుణంగా ఉందని అన్నారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తానని, ఎమ్మెల్యేగా వచ్చే జీతాన్ని పేద విద్యార్థుల చదువుకు ఉపయోగిస్తానని చెప్పారు. రాబోయే రోజుల్లో మున్సిపల్, పార్లమెంట్ ఎన్నికల్లో కాషాయపు జెండా ఎగురేసి ఇందూరు గడ్డ బీజేపీ కు అడ్డాగా మారుస్తామని అన్నారు మనమందరం కలసి కట్టుగా పార్టీ కి పనిచేయాలని కోరారు. నగర అభివృద్ధికి కేంద్రం సహాయం కోరుతానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతంకర్ లక్ష్మి నారాయణ, న్యాలం రాజు, ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, వెంకటేష్, స్వామి యాదవ్,బంటు రాము,బుస్సు పూర్ శంకర్, కైసర్, రాజశేఖర్ రెడ్డి, సుక్క మధు, గడ్డం రాజు, రోషన్ లాల్ బోర, పుట్ట వీరేందర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ప్రజా పాలన నోడల్ అధికారిగా క్రిస్టినా జడ్ చోంగ్తు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం అమలు తీరును జిల్లా స్థాయిలో పరిశీలించేందుకు వీలుగా సీనియర్ ఐ.ఏ.ఎస్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారిగా సీనియర్ ఐఏఎస్ అయిన క్రిస్టినా జెడ్.చోంగ్తును నియమించారు. ఉభయ జిల్లాలో ప్రజా పాలన సభల నిర్వహణ తీరును పరిశీలిస్తూ, ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగేలా కృషి చేయనున్నారు.

కరాటే ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయ బహుమతి



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ఓపెక్ 4వ కరాటే చాంపియన్ షిప్ 2023లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన కరాటే ప్రదర్శన పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థినిలు తమ్మనపల్లి రుషిత, లోలపు భవానీలు ఉత్తమ ప్రదర్శన చేసి ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి బహుమతిగా కప్‌ను, మెడల్స్‌ను, ప్రశంస పత్రాలను నిర్వాహకులు అందజేశారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న, ఎస్ఎంసి చైర్మన్ లోలపు సుమన్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు అభినాష్, శివాని, తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ సిటీ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



డిచ్‌పల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఏర్గట్ల: మాట్లాడుతున్న ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి

ప్రజా పాలనలో ప్రజలకు ఇబ్బందులుండొద్దు

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- ఆరు గ్యారంటీ పథకాలు అర్హులకు లబ్ది పొందేలా చూడాలి
- మండలాల్లో అధికారులకు అవగాహన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాదు నగరం లోని మున్సిపల్ కార్యాలయం లో రేపటి నుంచి ప్రారంభం అయ్యే ప్రజా పాలనా పై ప్రజల్లో ఎలా ముందుకు వెళ్లాలో అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ మకరంద్‌తోపాటు ఉన్నత అధికారులు సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. నిజామాబాదు అర్బన్‌లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందుకు తీసికెళ్లాలని కోరారు. ప్రజలకు ఆరు గ్యారెంటీల మీద అవగాహనా కల్పించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. నగరంలో అన్ని డివిజన్‌లలో ఏ విదంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయో ఎప్పటికప్పుడు అధికారులు వివరించాలని కోరారు. ఇవే కాకుండా మిగితా ఏవైనా సమస్యల కోసం ప్రజలు వస్తే జనరల్ కౌంటర్‌లో ఫిర్యాదు చేయాలనీ కోరారు. ప్రతి ఒక్కరితో ప్రేమతో మాట్లాడి వారి సమస్యలు తీర్చాలని అన్నారు. పోలీస్ ఉన్నత అధికారులు కూడా జనాలు ఎక్కడైతే ఎక్కువగా ఉంటారో అక్కడ బందోబస్త్ ఉంచాలని సూచించారు. కోవిడ్ బారిన పడకుండా ప్రతి ఒక్కరు మాస్కులు ధరించి రావాలని ప్రజలకు సూచించడం జరిగింది ప్రజా పాలనా ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ కిరణ్ కుమార్, మున్సిపల్ అధికారులు, సిఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరు గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతిఒక్క లాబ్దిదారులకు అందేవిధంగా ప్రతి అధికారి ప్రత్యేక కృషి చేయాలని ఈ నెల 28 నుండి జనవరి 6వరకు చేపట్టే ఈ కార్యక్రమం విజయవంతం కావాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఉన్నతస్థాయి అధికారులు వివిధ శాఖలకు సంబంధించిన మండలాల అధికారులు సిబ్బందితో అవగాహన కార్యక్రమం డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం అమలుపై వివిధ శాఖల అధికారులకు సిబ్బందికి అవగాహన కల్పిస్తూ, నియోజవర్గంలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహిస్తూ గ్రామానికి సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరు లబ్ది పొందేలా తగిన చర్యలు చేపడుతామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరు లబ్ది పొందేలా ప్రతి గ్రామంలో 28 నుండి 6 వరకు గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రతి పథకం గురించి వివరిస్తు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్ర మంలో అర్డిఓ రాజే ఎసిపి కిరణ్ కుమార్, డిఆర్‌డీవో పడీ ప్రత్యేక అధికారి చందర్ నాయక్, రంజిత్ రెడ్డి, సంజీవ్ కుమార్, తహసిల్దార్ల రాజేందర్, వెంకట్రావు, ఎంపిడివోలు టివిఎస్ గోపి బాబు, రాములు నాయక్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఎస్సైలు యు.మహేష్, ఎస్.మహేష్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అమృతాపుర్ గంగాధర్, మోత్కురి నవీన్ గౌడ్, శ్యాంసన్, ముప్పగంగారెడ్డి, ధర్మాగౌడ్ నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ , ఎంఆర్వో ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీలా అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన విషయం విధితమే. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ అర్హుల నుంచి ఈనెల 28 నుంచి జనవరి ఆరు వరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. మండల గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారుల బృందాలను ఏర్పాటు చేశామని, ఆయా గ్రామాలలో గ్రామసభలు ఏర్పాటు చేసి మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతు భరోసా తదితర పథకాలకోసం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు అలాగే మధ్యాహ్నం రెండు గంటల నుండి 6 వరకు రెండు దఫాలుగా దరఖాస్తులు స్వీకరించనున్నారని తెలిపారు. మండలంలో అర్హులైన లబ్దిదారులకు దశలవారీగా సామాజిక భద్రత సంక్షేమ పథకాలు ఆరు గ్యారంటీలు అందించడం కోసం దరఖాస్తుల స్వీకరణ కోసం ఒకరోజు ముందు వార్డుల్లో దండోరా వేయించి సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించనున్నారని చెప్పారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాలు నిర్వహించబోయే తేదీలు సమయాలను ముందస్తుగా ప్రజలకు తెలియజేయాలని సంబంధిత అధికారులకు ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ సూచించారు.

నిజామాబాద్ రూరల్: ప్రజాపాలనలో భాగంగా మండల కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటిసిలతో సమావేశం నిర్వహించారు. పిడి రాజేందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన 28 నుండి జనవరి 6వ తారీకు ఉంటుందని, ఇందులో పంచాయతీ సెక్రటరీలు చురుగ్గా పాల్గొనాలని అన్నారు. అభయ హస్తంలో భాగంగా మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, చేయూత, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు దరఖాస్తులు స్వీకరించాలని రాజేందర్ కోరారు. అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరించాలని నిజామాబాద్ రూరల్ మండలంలో 20 గ్రామాల నుండి దరఖాస్తులు వస్తాయని అన్నారు. ఈ గ్రామాలకు ఎంపీడీవో మల్లేశం, ఎమ్మార్వో అనురోద్, నియమించామని, వారు గ్రామాలకు సందర్శిస్తారని, వారి ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరించాలని మెప్మా పిడి రాజేందర్ కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేష్, ఎంపిఓ మధురిమ ఎమ్మార్వో అనురోద్ నాయక్, జెడ్పీటిసి సుమలత గోపాల్ రెడ్డి, ఎంపీపీ అనూష ప్రేమ నాయక్, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీలు, తదితరులు పాల్గొన్నారు

జక్రాన్‌పల్లి: ప్రజాపాలన ఆరుగ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ పై మండల స్థాయి గ్రామస్థాయి అధికారులతో మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుంచాల విమల రాజు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్ రావు హాజరై మాట్లాడుతూ ప్రజా పాలన ప్రజలకు చేరువగా పాలన అందించడానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు . జక్రాన్ పల్లి మండలం ప్రజాపాలన 6 గ్యారంటీలో దరఖాస్తులు చేసుకునే విధానాన్ని తెలియజేశారు. దరఖాస్తుదారు నుంచి రేషన్ కార్డ్ ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకొని ఆరు గ్యారంటీలకు జతపరచాలని గ్రామంలోని ప్రజలిచ్చే అన్ని దరఖాస్తులు తీసుకోవాలని గ్రామంలోని జరగని పనుల విషయంలో ఇచ్చే దరఖాస్తులు కూడా తీసుకోవాలని ఈ ఆరు గ్యారెంటీలే తీసుకొనబడతాయని ప్రజలతో చెప్పకూడదని అన్నారు. వారు ఇచ్చే ప్రతి దరఖాస్తు తీసుకొని ప్రజా పాలన కార్యక్రమం 28 తారీకు నుంచి జనవరి ఆరవ తారీకు వరకు దరఖాస్తులు తీసుకొనబడతాయని ప్రజా పాలన కార్యక్రమంలో ఎనిమిది పని దినాలు నిర్వహించాలని సూచించారు.ప్రతిరోజు రెండు షిఫ్ట్ లో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరపాలి. ప్రభుత్వ సెలవు దినాలు డిసెంబర్ 31 జనవరి 1 మినహాయించి,డిసెంబర్ 28 నుండి జనవరి ఆరో తేదీ వరకు నిర్వహించాలని స్పెషల్ ఆఫీసర్ తిరుమల ప్రసాద్ రావు, ఎంపీడీఓ బ్రహ్మానందం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, ఎమ్మార్వో ఎంఏ ఖలీం, ఎస్సై తిరుపతి, మండల కో ఆప్షన్ సభ్యుడు బుల్లెట్ అక్బర్ ఖాన్,ఎంపీఓ యూసఫ్ ఖాన్, ఏపీవో రవి, ఏపీఎం రవీందర్, వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు, గ్రామపంచాయతీ సెక్రటరీలు ,ఫీల్డ్ అసిస్టెంట్లు,తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవ్ అధ్యక్షతన మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని, దీన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజాపాలనలో ఆరుగ్యారెంటీలకు సంబంధించిన ఒకే దరఖాస్తు నింపి గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అధికారులకు ఈ కార్యక్రమం గురించి సూచనలు చేస్తూ ఇచ్చిన షెడ్యూలు ప్రకారంగా గ్రామసభలు నిర్వహించి ఏర్పాటు చేసిన కౌంటర్లలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కౌంటర్లలో తాగునీటి వసతి టెంట్ ఏర్పాటుచేసి గ్రామస్థాయిలలో విస్తృత ప్రచారం కల్పించాలని ప్రతినిధుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింగం నాయక్, తాసిల్దార్ కుతుబుద్దీన్, డిప్యూటీ తాసిల్దార్ మునిరుద్దీన్, ఎంపిఓ ఇక్బాల్, ఈవో రవీందర్, ఏ ఈ పంచాయతీరాజ్ స్రవంతి, మరియు గ్రామ పంచాయతీ సెక్రెటరీలు, ఉపాధి హామీ సిబ్బంది హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలో ఈనెల 28 నుండి వచ్చే నెల ఆరు వరకు అభయ హస్తం గ్యారెంటీల అమలులో భాగంగా గ్రామాల్లో నిర్వహించే ప్రజా పాలన గ్రామ సభలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అధికారులు ఆయా గ్రామాల అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. గురువారం నుండి ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అభయ హస్తం ఆరు గ్యారెంటీ లకు లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తుల స్వీకరణపై మండల స్థాయి అధికారులు వివరించారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే ప్రజలకు సౌకర్యాలు, అభయ హస్తం ఆరు గారెంటీ పథకాల గురించి ప్రజలకు తెలిసేందుకు ప్రచారం, తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి, మండల ప్రత్యేక అధికారి యోహన్, ఎంపీడీవో సంతోష్ రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్, ఎస్ఐ రాజశేఖర్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ మైలారం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ప్రజాపాలన కార్యక్రమ సరళి 'అభయ హస్తం' ఆరు గ్యారెంటీలపై బుధవారం ముప్కాల్ మండలకేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సమక్షంలో మండల ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు 'అభయ హస్తం' ఆరు గ్యారెంటీలపై లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నందని ఎంపీడీవో దామోదర్ తెలిపారు. ప్రతి ఇంటికి దరఖాస్తులను సిబ్బంది ద్వారా వస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ విషయాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీడీవో, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీవో, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, వార్డు సభ్యులు, అంగన్ వాడి, ఆశ, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

ఏర్గట్ల: మండలకేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ ఉపేంధర్ రెడ్డి అధ్యక్షతన ప్రజాపాలన కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి కంపాటి మల్లయ్య మాట్లాడుతూ... జనవరి 6 వరకు అన్ని గ్రామపంచాయతీలలో వివిధ పథకాలకోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ప్రతి దరఖాస్తు దారుడికి రసీదు ఇస్తారని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, వైస్ ఎంపీపీ సల్ల లావణ్య, ఎంపీటీసీలు మధుసూదన్, బొల్లి శంకర్, ఆడేం సవిత గంగాప్రసాద్, సర్పంచ్లు గుల్లే లావణ్య గంగాధర్, కుండ నవీన్, పద్మాసాగర్, పత్తిరెడ్డి ప్రకాష్, గద్దె రాధ గంగారాం, సోమా రాజారెడ్డి, భానుప్రసాద్, మంజుల బాలాజీ గౌడ్,ఎమ్మార్వో యూసుఫ్, ఎంపిడిఓ రాజేశం,ఎంపిఓ శివ చరణ్,ఏఓ అబ్దుల్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం లోని రైతు వేదికలో బుధవారం అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ (ప్రజా పాలన) పై నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు గ్రామాలలో షెడ్యూల్ ప్రకారం అధికారుల బృందాలు వెళ్లి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. పట్టణం, గ్రామాలలో కుటుంబానికి ఒకటి చొప్పున ఆధార్, రేషన్ కార్డులు జతచేసిన దరఖాస్తులను స్వీకరించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ కోసం ఆర్మూర్ పట్టణం, గ్రామాలలో దండోరా, టామ్ టామ్ చేయించి, అవసరమైతే మైకుల ద్వారా ప్రచారం చేయాలన్నారు. దీనివల్ల గ్రామస్తులందరికీ ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరించడానికి అధికారుల బృందాలు వస్తున్నట్లు తెలుస్తుందన్నారు. షెడ్యూల్ ఇచ్చిన రోజు గ్రామ జనాభా మేరకు టేబుల్ లను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈ బృందాలు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రజా పాలనలో ఇచ్చే దరఖాస్తులలో తప్పులు, స్పెల్లింగ్ దోషాలు లేకుండా పూర్తి చేసి అధికారులకు ఇవ్వాలని సూచించారు. 100 కుటుంబాలకు ఒక టేబుల్ చొప్పున ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, పశుసంవర్ధక శాఖ జెడి జగన్నాథ చారి, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, ఎంపీడీవో లు శ్రీనివాస్, నాగవర్ధన్, తహసిల్దార్ శ్రీకాంత్, ఆలూరు తాసిల్దార్ నరేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, ఎంఈఓ రాజ గంగారాం, నియోజకవర్గంలోని మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మెండోర : మండలంలోని వీవోఏలతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి సెర్ప్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించి అవగాహన కల్పించారు. తన పరిధిలో ఉన్న ప్రతి అర్హత ఉన్న మహిళ అభయ హస్తం గ్యారెంటీ స్కీములను వినియోగించుకునే విధంగా వాళ్లకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీయం విక్రమ్ రెడ్డి, అకౌంటెంట్ జగదీష్, అన్నిగ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.



మెండోరలో...



నిజామాబాద్ రూరల్ మండలంలో...



సిరికొండలో..

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

మధ్యతరగతి ప్రజలు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని వ్యాపార ఉద్యోగవర్గ ప్రజలు గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారుల కుటుంబాలకు తమవంతు బాధ్యతలు నిర్వర్తించడం అభినందనీయమని ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తావద్ద గల గాయత్రి బ్యాంకు ఖాతాదారుడైన ఏనుగు సాయన్న ప్రమాదవశాత్తు మరణించగా ఆయన భార్య ఏనుగు లక్ష్మికి బుధవారం లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామమాత్రపు చార్జీలతో లక్ష రూపాయల ప్రమాద బీమా ద్వారా ఖాతాదారుల కుటుంబాలను ఆదుకుంటున్నారని అన్నారు. బ్రాంచ్ మేనేజర్ రామోజీ లింబాద్రి మాట్లాడుతూ ఖాతాలు ప్రారంభించుటకు కావలసిన ఫొటో, జిరాక్స్‌లను బ్యాంకులో ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పరిసర గ్రామాల్లో 17 బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించామని తెలిపారు. పెన్షనర్లు ఇతర ఖాతాదారులు బ్యాంకింగ్ కరస్పాండెంట్ల వద్ద బ్యాంకు లావాదేవీలను నిర్వర్తించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అక్రమ ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు

నవతెలంగాణ-బాల్కొండ



మండల పరిధిలోని బోదేపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీకి సంబంధించిన స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని బుధవారం తహసిల్దార్ అడ్ప శ్రీధర్‌కు పలువురు వినతి పత్రం సమర్పించారు. ఈ స్థలం గ్రామపంచాయతీకి సంబంధించిందని ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు. ఆ స్థలాన్ని ఇటీవల అక్రమంగా విక్రయించామని అన్నారు. విక్రయించిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దారును కోరారు.